సాక్షి జనగామ

శనివారం | 21 | జనవరి | 2023



రీ ఓపెన్ అయ్యేనా?

కేయూలో పీజీ విద్యార్థులకు ఇచ్చిన సెలువులు ముగిశాయి. కామన్ మెస్ నేటి నుంచి తెరవాల్సి ఉండగా.. మరమ్మతులు ఇంకా పూర్తి కాలేదు. - 8లో▸



ఏసీబీ ట్రాప్

ఏటూరునాగారం ఐటీడీఏ ఆవరణలో లంచం తీసుకుంటూ ఇద్దరు ఇంజనీరింగ్ అధికారులు ఏసీబీకి పట్టుబడ్డారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/17^0$

వాతావరణం

ఉదయం మంచుతోకూడిన చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమైనా.. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి. రాత్రి చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

సొంత జిల్లాలకు అవకాశం కల్పించాలి



కానుగంటి రంజిత్‌కుమార్

జఫర్‌గఢ్: ప్రభుత్వం ప్రస్తుతం చేపడుతున్న ఉపాధ్యాయ బదిలీల్లో 317 జీఓ ద్వారా ఇతర జిల్లాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు మరోసారి సొంత జిల్లాలకు వెళ్లేందుకు అవకాశం కల్పించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఉప్పుగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రంజిత్‌కుమార్ ఇటీవల రంగారెడ్డి జిల్లాలో జరిగిన యూనియన్ మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కోర్టు కేసు ఉన్న పండిట్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్ త్వరగా పరిష్కరించేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. సీనియారిటీ జాబితాను తప్పులు లేకుండా తయారు చేయడంతో పాటు ప్రిపరెన్షియల్ మెడికల్ గ్రౌండ్ కేటగిరిలో తప్పుడు సమాచారం ఇచ్చే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓటర్ల ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి

వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

జనగామ: ఓటరు జాబితాలో ఉన్న పీఎస్ఈ(ఫొటో సెమిలరీ ఎంట్రీ) ఫీల్డ్ వెరిఫికేషన్ 15 రోజుల్లో నూరుశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి టి.రవికిరణ్‌తో కలిసి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని, ప్రతి జిల్లాలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన సాంగ్‌ను మైక్‌ల ద్వారా వినిపించిన అనంతరం ప్రతిజ్ఞ చేయించాలని చెప్పారు. అలాగే స్థానిక కేబుల్ చానళ్లతో పాటు సినిమా థియేటర్లలో తప్పక ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 80 ఏళ్లు పైబడిన వారితో పాటు నూతన ఓటర్లను సత్కరించాలన్నారు. ఓటరు కార్డుతో ఆధార్ లింకేజ్ అర్బన్ ప్రాంతంలో వేగవంతం చేయాలని, నూతన ఓటర్లకు పోస్టల్ శాఖ ద్వారా కార్డులు అందేలా చూడాలని చెప్పారు. కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ జిల్లాలో ఓటరు కార్డుతో ఆధార్ లింకేజ్ 87.73 శాతం పూర్తయిందని, మరింత వేగవంతం చేస్తామన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీఓలు, ఈఆర్‌ఓలు మధుమోహన్, కృష్ణవేణి, డీఆర్‌డీఓ రాంరెడ్డి, తహసీల్దార్లు రవీందర్, శ్రీనివాస్, పాల్‌సింగ్, నాయబ్ తహసీల్దార్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గోవుల పెంపకంతో బహుళ ప్రయోజనాలు




దేవరుప్పుల: గోవుల పెంపకంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. మండల పరిధి రంబోజీగూడెంలో పరమేశ్వర్ గోశాల ఆధ్వర్యంలో శుక్రవారం 10 మంది రైతులకు రెండు చొప్పున కోడెదూడలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంతో పాటు ప్రత్యామ్నాయ ఆదాయాన్ని పొందే పశుసంపదను వృద్ధి చేయాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గోశాల ప్రదర్శన రాష్ట్ర అధ్యక్షుడు గాడిపల్లి రాజేశ్వరరావు, తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరవింద్. దుర్గం రోజా, సర్పంచ్ సింగిరెడ్డి సరితసతీష్, అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

జనగామ: విద్యార్థులకు పెండింగ్ ఫీజురీయింబర్స్ మెంట్‌లో జాప్యాన్ని నిరసిస్తూ.. బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా అధ్యక్షుడు శానబోయిన మహిపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీగా చౌరస్తాకు చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, దిష్టిబొమ్మకు నిప్పు పెట్టారు. అనంతరం మహిపాల్ మాట్లాడు తూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐదుగురు కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట వినోద్‌కుమార్, జనగామ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఇ.నవీన్ కూమార్, పట్టణ ఉపాధ్యక్షులు రాహుల్ సింగ్, చందు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు స్కూళ్లకు పీఎం శ్రీ వెలుగులు



సర్కారు స్కూళ్లను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం 'పీఎం శ్రీ యోజన' పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో విద్యను మరింత పటిష్టం చేసేలా ప్రణాళిక రూపొందించింది. 2023–24 విద్యాసంవత్సరం నుంచి మొదలు కానున్న ఈ పథకం కింద ప్రతి మండలానికి రెండు స్కూళ్ల చొప్పున ఎంపిక చేయడానికి చేపట్టిన ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. జిల్లాలో 24 స్కూళ్లకు మహర్దశ పట్టనుంది. ఇందుకు కేంద్ర విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది.

- జనగామ



పాఠశాలల ఎంపిక చివరి దశకు

- అర్హత సాధించిన 118 పాఠశాలలు
- 39 ఫైనల్.. 24 స్కూళ్లకు అవకాశం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం

కేంద్ర సర్కారు తీసుకువచ్చిన 'పీఎం శ్రీ యోజన' పథకంలో అర్హత సాధించిన ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారనున్నాయి. దేశ వ్యాప్తంగా యూడైస్ డాటా బేస్ ఆధారంగా కేంద్ర విద్యా శాఖ ఈ పథకం కింద పాఠశాలలను ఎంపిక చేస్తుంది. ఇందులో పక్కా భవనం, బాలురకు, బాలికలకు వేర్వేరు టాయిలెట్లు, నీరు, విద్యుత్ సదుపాయం తప్పనిసరి ఉండాలని నిబంధనల్లో పేర్కొంది. జిల్లాలో ప్రాథమిక పాఠశాలు 341, ప్రాథమికోన్నత 64, ఉన్నత పాఠశాలలు 103, కేజీబీవీలు 12, టీఎస్ మోడల్ స్కూళ్లు 8, ఆయా కేటగిరీల్లోని రెసిడెన్షియల్ పాఠశాలలు 19 ఉన్నాయి. ఇందులో కేంద్ర విద్యాశాఖ నిబంధనల మేరకు 118 పాఠశాలలు ఉన్నట్లు గుర్తించారు. గత ఏడాది దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశారు. జిల్లాలో కలెక్టర్ నేతృత్వంలో జిల్లా విద్యాధికారి పర్యవేక్షణలో పరిశీలించి పూర్తి నివేదికలను రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులకు పంపించారు. ఆ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో స్క్రూటినీ చేశారు.

ఇవీ చేపట్టే పనులు..

పీఎం శ్రీ పథకంలో ఎంపికైన పాఠశాలలను జియో ట్యాగింగ్ చేసి, వాటిలో నిర్వహించే కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తారు. నిపుణుల కమిటీ సిఫారసు మేరకు ఎంపిక చేసిన స్కూళ్లకు విడతల వారీగా నిధులు మంజూరు చేస్తారు. వీటితో విద్యార్థులకు అవసరమైన సాంకేతిక పరికరాలను సమకూర్చుకునే అవకాశం ఉంటుంది. ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు స్వయంగా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు సాగుచేయాలి. పాఠశాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి. వేస్ట్ మేనేజ్‌మెంట్, నీటి నిర్వహణ తదితరాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. పర్యావరణ పరిరక్షణకు సంప్రదాయ విధానాలను విద్యార్థులకు నేర్పించాల్సి ఉంటుంది. ఎల్ఈడీ బల్బులు, న్యూట్రిషన్ గార్డెన్, శుద్ధి చేసిన నీటి సరఫరా, వాతావరణంలో వచ్చే మార్పులు, సోలార్ విద్యుత్ సిస్టం, జిల్లాకు సంబంధించిన సంస్కృతి, సంప్రదాయాలు, జీవన-విద్యా విధానంలో కలిగే మార్పులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పెంపొందిండచం, అవసరమైన వలంటీర్ల నియామకం చేపట్టి.. విద్యార్థులకు బంగారు భవిష్యత్ కల్పిస్తారు. 2026–27 విద్యాసంవత్సరం వరకు ఈ పథకం అమలులో ఉంటుంది.

మండలానికి రెండు స్కూళ్లు..

పీఎం శ్రీ పథకంలో క్రీడలు, ఐసీటీ(కంప్యూటర్ కోర్సు), కళలు, భాషా నైపుణ్యాలు, కెరీర్ గైడెన్స్ ఇలా విద్యాప్రణాలు కలిగిన పాఠశాలలను ప్రతి మండలానికి రెండు ఎంపిక చేస్తారు. ఇందులో ఒకటి ప్రాథమిక, మరొకటి ఉన్నత పాఠశాల ఉంటుంది. వీటితో పాటు కేజీబీవీ, మోడల్, రెసిడెన్సియల్ గురుకులాలు కూడా పోటీ పడుతున్నాయి. ఇందులో కేంద్ర విద్యాశాఖ నిబంధనల మేరకు ఉన్న 118 పాఠశాలల్లో 39 అర్హత సాధించాయి. వీటిలో 24 స్కూళ్లను ఎంపిక చేయనున్నారు. నిధుల్లో 60శాతం కేంద్రం వాటా ఉండగా.. మిగిలిన 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

త్వరలోనే తుది జాబితా..



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే పీఎం శ్రీ పథకంతో సర్కారు స్కూళ్లకు మహర్దశ పట్టనుంది. జిల్లాలో 39 పాఠశాలలు అర్హత సాధించగా.. ఇందులో మండలానికి రెండు చొప్పున 24 స్కూళ్లు ఎంపికవుతాయి. తుది జాబితా త్వరలో రానుంది.

- రాము, జిల్లా విద్యాశాఖ అధికారి

తాగునీరు, కుర్చీలు అందుబాటులో ఉండాలి

నెల్లుట్ల శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఓబుల్‌కేశ్వాపూర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్





- ఆదేశించిన కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య
- కంటి వెలుగు శిబిరాల ఆకస్మిక తనిఖీ

జనగామ/లింగాలఘనపురం/జనగామ రూరల్/బచ్చన్నపేట: 'కంటి వెలుగు' వైద్య శిబిరాల్లో ప్రజలకు అవసరమైన తాగునీరు, కుర్చీలు ఇతర సదుపాయాలు తప్పనిసరి కల్పించాలని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య ఆదేశించారు. జిల్లాలో గురువారం ప్రారంభమైన రెండో విడత 'కంటి వెలుగు'కు సంబంధించి పలు శిబిరాల్లో సమస్యలు తలెత్తడంతో పాటు సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బంది పడిన విషయమై 'కుదరని సమన్వయం' శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా వైద్యాధికారితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. లింగాలఘణపురం మండలం నెల్లుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ కంటి పరీక్షల కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే కంటి పరీక్షలకు అవసరమైన మందులు, రీడింగ్ అద్దాలు సరిపడా ఉంచాలని చెప్పారు.

ఓబుల్‌కేశ్వాపూర్‌లో అదనపు కలెక్టర్..

జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్ కంటి వైద్య శిబిరాన్ని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆకస్మిక తనిఖీ చేశారు. కంటి పరీక్షలు, వసతి సదుపాయాలను పరిశీలించారు. ప్రభుత్వం ఆశించిన లక్ష్యం చేరుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.



అలీంపూర్ శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ

అలీంపూర్‌లో డీఎంహెచ్ఓ..

బచ్చన్నపేట మండలం అలీంపూర్ కంటి వైద్య శిబిరాన్ని వైద్యారోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎ.మహేందర్ ఆకస్మికంగా సందర్శించారు. పర్యవేక్షణ అధికారులు, సిబ్బందితోపాటు ప్రజలతో మాట్లాడారు. కనీస సౌకర్యాలు ఉండేలా చూడాలని, ఎటువంటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు వినోద్‌కుమార్, నాగేశ్వరశర్మ, కేఆర్ జ.లత, ఎంపీడీఓ హసీమ్, తహసీల్దార్ అంజయ్య, ఐటీ ప్రోగ్రాం మేనేజర్ రాజశేఖర్, కంటి వెలుగు లైజన్ ఆఫీసర్ రోజారాణి, డాక్టర్ కరుణాకర్ రాజు తదితరులు ఉన్నారు.

ఆధార్ కార్డులు రెన్యూవల్ చేసుకోవాలి

కొడకండ్ల: ఆధార్‌కార్డులు 2016 కంటే ముందు పొందిన ప్రతి ఒక్కరూ రెన్యూవల్ చేసుకోవాలని జిల్లా ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ దుర్గారావు సూచించారు. శుక్రవారం ఏడునూతుల గ్రామ శివారు జమ్మికుంట తండాలో ఏర్పాటు చేసిన ఆధార్ రెన్యూవల్ ప్రత్యేక శిబిరాన్ని వరంగల్ డీఎం రాకేష్‌శర్మ, జనగామ డీఎం రాజుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మీసేవ నిర్వాహకుడు దేశగాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆధార్ అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

ఆలయాలకు పూర్వ వైభవం

- కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి
- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- శ్రీసోమేశ్వరాలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారణం

పాలకుర్తి/పాలకుర్తి టౌన్: తెలంగాణ సాధించాకే రాష్ట్రంలో ఆలయాలకు పూర్వ వైభవం వచ్చింది.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేయగా.. కార్యక్రమానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ.. సోమనాథుడు, పోతన, వాల్మీకి నడయాడిన పాలకుర్తి, వల్మిడి, బమ్మెర గ్రామాల్లో రూ.62.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాతే వల్మిడి, పాలకుర్తి, బమ్మెర గ్రామాల చారిత్రక విలువలు పెరిగాయన్నారు. పాలకుర్తికి రూ.16.50 కోట్లు, వల్మిడికి రూ.7 కోట్లు, బమ్మెరకు రూ.14 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి నూతన సభ్యులు నిరంతరం పని చేయాలని సూచించారు. పాలకుర్తిలో కొద్ది రోజుల్లోనే అభివృద్ధి పనులు పూర్తవుతాయని అన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ వెనుకదాసుల రాంచంద్రయ్య శర్మ, సభ్యులతోపాటు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సునిత, ఇన్‌స్పెక్టర్ కవిత, ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, పాలకుర్తి సర్పంచ్ యాకాంతరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్మకర్తల మండలి సభ్యులతో మంత్రి ఎర్రబెల్లి

విద్వేషాలను రెచ్చగొడుతున్న పాలకులు

- సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రాజా



కామారెడ్డిగూడెంలో షేక్ బందగీ స్థూపం వద్ద వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

దేవరుప్పుల: కేంద్రం, రాష్ట్రంలో ఉన్న పాలకులు విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజలను సమస్యల నుంచి తప్పుదారి పట్టిస్తున్నారని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రాజా అన్నారు. ఫిబ్రవరి 15 నుంచి పాట్నాలో జరిగే పార్టీ జాతీయ మహాసభల కరపత్రాలను శుక్రవారం కామారెడ్డి గూడెంలో షేక్ బందగీ స్మారక స్థూపం వద్ద ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు సమావేశంలో జిల్లా కార్యదర్శి మాన్యపు బుజేందర్‌తో కలిసి మాట్లాడారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలపై రానున్న ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా చేపట్టే పోరాటాల కార్యాచరణను ఈ మహాసభల్లో రూపొందిస్తారని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న మతోన్మాద, పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలు దేశాన్ని సంక్షోభం వైపు నెట్టివేయడంతో ప్రజల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు జీడి సోమయ్య, మండల నాయకులు చింత భాస్కర్ మహరాజ్, తూర్పాటి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం

- వరంగల్–1 డిపో మేనేజర్ శ్రీనివాసరావు

జఫర్‌గఢ్: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం.. ప్రతి ఒక్కరూ సంస్థను ఆదరించాలని వరంగల్–1 డిపో మేనేజర్ శ్రీనివాసరావు కోరారు. ఆయన శుక్రవారం స్థానిక బస్టాండ్‌ను సందర్శించారు. అంబేడ్కర్ సెంటర్ వద్ద ఉన్న బస్టాండ్ స్థలాన్ని సైతం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి ప్రమాదాల బారిన పడొద్దని సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. తమ సంస్థ విద్యార్థులకు బస్‌పాసుల్లో రాయితీ కల్పిస్తున్నదని చెప్పారు. ఈ సందర్భంగా హిమ్మత్ నగర్ గ్రామంలో 'ప్రజల వద్దకు ఆర్టీసీ' కార్యక్రమం నిర్వహించి సంస్థ అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సీఆర్‌సీ యాదగిరి, సేఫ్టీ వార్డెన్ డి.యాదగిరి, బస్టాండ్ ఇన్‌చార్జ్ రఘువీర్, డ్రైవర్ పట్టపూరి నాగేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జఫర్‌గఢ్ ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డిపో మేనేజర్ శ్రీనివాసరావు

ఆరోగ్యం అందరి హక్కు

- ధరలు, సరుకుల నాణ్యతపై తనిఖీలు నిర్వహించాలి
- ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- సమీక్షలో కలెక్టర్ శివలింగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, పాల్గొన్న అదనపు కలెక్టర్, అధికారులు

జనగామ: ఆరోగ్యం అందరి హక్కు.. వినియోగదారులకు తమ హక్కులను తెలియ జేసేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పౌర సరఫరాల ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్‌తో కలిసి మాట్లాడారు. ప్రైవేటుగా హోల్‌సేల్, రిటేయిల్ వ్యాపారులు నిత్యావసర సరుకులను ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందని, చట్ట విరుద్ధంగా వ్యవహరించే వారిపై వినియోగదారుల చట్టం కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. వంట నూనె, వ్యవసాయ విత్తనాలు, మాంసాహారం, డీజిల్, పెట్రోలు అమ్మకాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని చెప్పారు. బహిరంగ మార్కెట్‌లో ధరల పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీలతో నిఘా పెడతామని, ఈ విషయంలో వినియోగదారులకు ఎటువంటి సందేహాలున్నా కస్టమర్ టోల్ ఫ్రీ నంబర్–1967, కస్టమర్ హెల్ప్‌లైన్ నంబర్–1800 4254 614లో సంప్రదించాలని సూచించారు. సమీక్షలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎం.రోజారాణి, డీఆర్డీఓ రాంరెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారులు మధుమోహన్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

జిల్లా కేంద్రంలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జాతీయ జెండా ఆవిష్కరణ, ఉత్సవాల నిర్వహణకు ఆయా శాఖలు సమన్వయంతో ఇప్పటి నుంచే పనులు ప్రారంభించాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. శాఖల వారీగా ఉత్తమ ఉద్యోగుల జాబితా సిద్ధం చేసి అవార్డులకు ప్రతిపాదనలు పంపించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్డీఓలు, డీఆర్‌డీఓతోపాటు సీపీఓ ఇస్మాయిల్, ఇన్‌చార్జ్ డీపీఓ వసంత, డీఏఓ వినోద్‌కుమార్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ షురూ..

- 10 వెహికిల్స్ సీజ్.. 4 డ్రంకెన్ డ్రైవ్ కేసులు




జనగామ చౌరస్తాలో పోలీసుల తనిఖీలు

జనగామ: జిల్లా కేంద్రంలో శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ ప్రారంభించారు. ఎంవీ చట్టం నిబంధనల మేరకు సరైన నంబర్ ప్లేట్, లైసెన్స్, వాహన పత్రాలు లేనిదే వాహనం రోడ్డెక్కొద్దని చెబుతూ వస్తున్నారు. ఈనెల 17వ తేదీ వరకు అవకాశం ఇచ్చిన పోలీసులు మూడు రోజుల ఆలస్యంగా రంగంలోకి దిగారు. డీసీపీ.సీతారాం పర్యవేక్షణలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సైలు శ్రీనివాస్, భరత్, జీనత్, పోలీసు సిబ్బంది ద్విచక్రవాహనాలతో పాటు ఇతర వెహికిల్స్ పత్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 10 వాహనాలను సీజ్ చేయడంతోపాటు డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురు పట్టుబడ్డారు. అలాగే ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా వెళ్లి వాహనాలకు గతంలో వేసిన రూ.30వేల జరిమానాలను వసూలు చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ వాహనాలకు నంబర్ తప్పనిసరి ఉండాలి.. అవి క్లియర్‌గా కనిపించాలి.. ప్లేట్ మార్చడం.. దానిపై స్టిక్కర్లు అతికించడం లాంటివి చేస్తే వాహనం సీజ్ చేసి చీటింగ్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండురలకు సూచించారు.

పాలకుర్తిలో 16వ శతాబ్దపు దీపస్తంభ శాసనం

- గుర్తించిన చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి



శిలపై గుర్తించిన చక్రం గంటు

పాలకుర్తి టౌన్: పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం ముందున్న 16వ శతాబ్దపు దీప స్తంభం శాసనాన్ని ఔత్సాహిక పురావస్తు చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి గుర్తించారు. ఈ మేరకు వివరాలను శుక్రవారం వెల్లడించారు. ఈ దీప స్తంభ శాసనంపైన గరుత్మంతుడు, వీరాంజనేయుడి చిత్రాలు, వాటి కింద ఒకటి లేదా రెండు అక్షరాలతో 10 వరుసలు ఉన్నాయి. లిపిని బట్టి 16వ శాతాబ్దానికి చెందినదిగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ఉత్సవాలు(రంగభోగ) నిర్వహించడానికి దేవుడి భూమిని బహుమతిగా ఇచ్చినట్లు ఇందులో నమోదు చేసినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. ఇది దేవాలయానికి సంబంధించిన పురాతన చారిత్రక ఆధారమని, ఈ శాసనంపై అనేక మార్లు రంగులు, సున్నం వేస్తుండడంతో గుర్తించడానికి ఆ రంగులను తొలిగించినట్లు వివరించారు. ఈ చారిత్రక ఆధారాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఆలయ ప్రాంగణంలోని భక్తాంజనేయ దేవాలయం ఎదురుగా ఒక పెద్ద శిలపై చెక్కిన చిత్రంలో చక్రం గంటు వేసి ఉందని, ఇది ఆలయ ప్రాచీన చరిత్రను తెలియజేస్తున్నదని వివరించారు.



దీప స్తంభ శాసనాన్ని పరిశీలిస్తున్న రత్నాకర్‌రెడ్డి

పాడి రైతుల విజ్ఞాన విహారయాత్ర

జనగామ రూరల్: జిల్లాలోని పాడి రైతులు విజయ డెయిరీ ఆధ్వర్యంలో శుక్రవారం విజ్ఞాన విహార యాత్రకు బయలు దేరారు. ఇందులో భాగంగా గజ్వేల్‌లోని దాణా కర్మాగారం, హైదరాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్, తెలంగాణలోని పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీలో ప్రొఫెసర్లతో పాడిపై అవగాహన కల్పిస్తారు. ఈయాత్రకు 80 మంది రైతులు వెళ్లగా వారితో చైర్మన్ సోమిరెడ్డి, డీడీ ధన్‌రాజ్, మేనేజర్లు హరికృష్ణ, లింగారెడ్డి, శివప్రసాద్ ఉన్నారు.

'బాల వికాస' పథకాలు ఆదర్శనీయం

ఆర్జేడీ కార్యాలయాన్ని తరలించొద్దు

'సూపర్' ఆస్పత్రిలో కూలిన సీలింగ్

వరంగల్ ఆర్వోలో కలకలం

10 లో

వందేభారత్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాశిబుగ్గ: సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం జరిగింది. వరంగల్ జీఆర్పీ సీఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 40–45 ఏళ్ల మధ్య వయస్సు, 5.5 ఎత్తు, నీలం రంగు టీషర్టు, గ్రే కలర్‌పాయింట్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి హంటర్ రోడ్డు సంతోషిమాత గుడి ఎదురుగా ఉన్న రైలు ట్రాక్‌పై పట్టాలు దాటుతుండగా.. వందేభారత్ రైలు ఢీకొట్టింది. మృతుడి శరీరంలో స్టీల్ రాడ్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు, మృతుడి వివరాలు తెలిస్తే వరంగల్ జీఆర్పీ స్టేషన్ లేదా 94406 04320, 94406 27532 నంబర్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

స్పెల్‌బీ విజేతలకు ప్రశంసపత్రాల అందజేత



'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన స్పెల్‌బీ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చి రీజినల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు శుక్రవారం రాంపూర్ యూనిట్ కార్యాలయంలో ప్రశంసపత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వైద శ్రీనివాస్, ఎడిషన్ ఇన్‌చార్జ్ వర్దెల్లి లింగయ్య, ఈవెంట్స్ ఇన్‌చార్జ్ సుమన్, ఫొటో జర్నలిస్టు సంపెట వెంకటేశ్వర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కామన్ మెస్ రీ ఓపెన్ అయ్యేనా?

- కేయూలో నేటితో ముగిసిన సెలవులు
- కొనసాగుతున్న మరమ్మతులు

కేయూ క్యాంపస్: కేయూలో పీజీ తదితర కోర్సుల విద్యార్థులకిచ్చిన 11 రోజుల సెలవులు శుక్రవారంతో ముగిశాయి. సంక్రాంతి సెలవుల పేరున హాస్టళ్లు, మెస్‌లలో మరమ్మతుల నేపథ్యంలో సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈనెల 21 నుంచి రీ ఓపెన్ చేయాల్సి ఉండగా.. కామన్ మెస్‌లో, పలు హాస్టళ్లలో ఇంకా మరమ్మతులు కొనసాగుతున్నాయి. పలు విభాగాల్లో పెయింటింగ్ వేయిస్తున్నారు. కేయూ హాస్టళ్ల కమిటీ చైర్మన్ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేశ్ లాల్, పాలక మండలి సభ్యులు పి.మల్లారెడ్డి, కేయూ అడ్మిషన్ల డైరెక్టర్ ఆచార్య వాసుదేవరెడ్డి, యూజీసీ కో–ఆర్డినేటర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి సమావేశమై చర్చించారు. కామన్ మెస్‌ను సందర్శించి పరిశీలించారు. మరమ్మతుల నేపథ్యంలో పీజీ విద్యార్థులకు (బాయ్స్)కు అందులో కామన్ మెస్‌లో మెస్ సౌకర్యాన్ని ప్రారంభించే అవకాశం లేదని గుర్తించారు. మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉండడంతో ఆయా విద్యార్థులకు ప్రత్యామ్నాయంగా మరోచోట ఏర్పాటు చేయాలని చర్చించారు. అందుకు కేయూ అడ్మిషన్ల డైరెక్టరేట్ లోని స్థలంలో మెస్ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనేది కూడా చర్చించినట్లు సమాచారం. శుక్రవారం సాయంత్రం 7గంటల వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే మహిళా హాస్టల్ లోనూ మరమ్మతులు కొనసాగుతున్నాయి. దీంతో రీఓపెన్ ఉంటుందా లేదా? అనేది కూడా యూనివర్సిటీ అధికారులు ప్రకటించలేదు. ఇక సెలవులు పొడిగించవద్దనే చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కానీ నిర్ణయాన్ని ప్రకటించడం లేదు. సెలవులు ముగిసినందున ఈనెల 21నుంచి తరగతులు యథావిధిగా కొనసాగించాల్సి ఉంటుంది ఈనెల 21 నుంచి విద్యార్థులు అయితే క్యాంపస్‌కు చేరుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. సోమవారం వరకు ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. సెలవులు పొడిగిస్తే విద్యార్థుల నుంచి వ్యతిరేకిత వచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే 11 రోజులు సెలవులు ప్రకటించినప్పుడే తమకు మూడ్రోజులు సెలవులు చాలు 11 రోజులు వద్దని ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈనెల 21 నుంచి యథావిధిగా పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి స్పష్టం చేశారు.

మరమ్మతులంటూ విద్యార్థులను నిరాకరించిన సిబ్బంది

కాకతీయ యూనివర్సిటీ మైక్రోబయాలజీ విభాగానికి చెందిన విద్యార్థులు(మహిళలు) సుమారు 12 మంది ఈనెల 21 నుంచి రీఓపెన్ ఉంటుందని భావించి శుక్రవారం సాయంత్రం యూనివర్సిటీకి వచ్చినట్లు సమాచారం. మహిళా హాస్టల్‌కు వెళ్లగా మరమ్మతులు జరుగుతున్నాయని లోనికి సంబంధిత సిబ్బంది నిరాకరించడంతో వారు ఆవేదనతో వెనుదిరిగినట్లు సమాచారం. మైక్రోబయాలజీ విభాగాధిపతి తప్పనిసరిగా ఈనెల 21న క్లాస్‌కు హాజరు కావాలని విద్యార్థులకు మెసేజ్‌లు పంపినట్లు తెలుస్తోంది. అయితే మెస్‌లు రీఓపెన్ అవుతాయో లేదో అని కూడా విద్యార్థినులు అనుమానం వ్యక్తం చేసినప్పటికీ మీరు హాజరు కావాల్సిందేనని సమాచారం పంపినట్లు తెలుస్తోంది. దీంతో ఆయా విద్యార్థులు క్యాంపస్‌కు వచ్చినట్లు సమాచారం. సెలవులు ముగిసినందున ఈనెల 21 నుంచి మెస్‌లు రీ ఓపెన్ చేస్తారా? అని కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావును 'సాక్షి' శుక్రవారం సాయంత్రం వివరణ కోరగా.. తాము వివిధ హాస్టళ్ల మెస్‌లను సందర్శించి మరమ్మతులు ఎలా జరుగుతున్నాయో.. పరిశీలించామని తెలిపారు. మహిళా హాస్టల్ మెస్‌లకు ఎలాంటి ఇబ్బంది లేదని, తెరిచే అవకాశం ఉందని బాయ్స్ కామన్ మెస్‌లోనే మరమ్మతులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయం చర్చించి నిర్ణయం వెల్లడిస్తామని శ్రీనివాస్‌రావు వివరణ ఇచ్చారు.

విద్యార్థి, ఉపాధ్యాయులకు కలెక్టర్ అభినందన



సాయిలేఖ్యను అభినందిస్తున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్ రూరల్: ప్రతిష్టాత్మక యంగ్ ఇన్నోవేటర్ ప్రోగ్రామ్ (వైఐపీ 2023) కార్యక్రమంలో పాల్గొన్న కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఈ.సాయిలేఖ్య, ఆమెను ప్రోత్సహించిన గైడ్ టీచర్ డాక్టర్ వి.గురునాథరావు, పాఠశాల హెచ్‌ఎం ఎస్.రమేశ్‌బాబును కలెక్టర్ కె.శశాంక శుక్రవారం అభినందించారు. మహబూబాబాద్ కలెక్టరేట్లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు, జిల్లా విద్యా శాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి బుచ్చయ్య, జిల్లా విద్యా శాఖ ఏసీజీఈ మందుల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. కాగా.. వైఐపీని హైదరాబాద్‌లో జనవరి 3 నుంచి 13 వరకు సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) నిర్వహించగా.. రాష్ట్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి సాయిలేఖ్య ఎంపికైంది. పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు డాక్టర్ వి.గురునాథరావు ఆధ్వర్యంలో పాల్గొంది.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు. జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన
ఫోన్ నంబర్లు : 95055 14424
గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు శ్రీ దండ రజనీకర్ రెడ్డి, తండ్రి వెంకట్ రెడ్డి, వయసు: 45 సంలు, వృత్తి: వ్యాపారం, నివాసం: ఇంటి నెం. 2-4-508, రాంనగర్, హన్మకొండ జిల్లా, వాస్తవ్యులు గారు ఈ దిగువ షెడ్యూలు దాఖల గల భూమి ప్లాటు నెం. 50, సర్వే నెం. 593/బి యందు విస్తీర్ణం 200 చగజములు, భీమారం గ్రామము, హసన్‌పర్తి మండలం, హన్మకొండ జిల్లా యందు కలదు. అట్టి ప్లాటును నా క్లయింటు శ్రీ గట్ల రమణారెడ్డి, తండ్రి: మల్లారెడ్డి, గారి నుండి రిజిస్టర్డ్ విక్రయదస్తావేజు నెం. 1575/2011, తేది: 24-03-2011 ద్వారా ఖరీదు చేసియుంటిరి, తదుపరి సదరు రిజిస్టర్డ్ లింక్ దస్తావేజు నెం. 2477/1988 కనిపించుట లేదు. అట్టి దస్తావేజు ఎవరికైనను దొరికినచో ఈ దిగువ చిరునామాకు సమాచారము తెలిపినచో తగిన పారితోషకము ఇవ్వబడును. లేదా సదరు దస్తావేజును ఉపయోగించి ఎటువంటి లావాదేవీలు నడిపినను అట్టి లావాదేవీలు చెల్లనేరవని పరిగణించబడును మరియు అట్టి వారలు నా క్లయింటు తీసుకొనబోవు చట్టపరమైన చర్యలకు పూర్తి బాధ్యులు కాగలరు.

షెడ్యూలు దాఖల ఆస్తి హద్దులు: ప్లాటు నెం. 50, సర్వే నెం. 593/బి, విస్తీర్ణం 200 చగజములు, భీమారం గ్రామము, హసన్‌పర్తి మండలం, హన్మకొండ జిల్లా యందు గలదాని **హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం. 59, **పడమర:** 30 ఫీట్ల రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నెం. 51, **దక్షిణం:** ప్లాట్ నెం. 49.

Sd/- CH. AGA REDDY, B.Sc., LL.B.
Advocate Notary
Opp: NPDCL Office, Nakkalagutta, Hanamkonda. Cell: 9490380382

నీవెంటే నేను!

- మృత్యువులోనూ వీడని బంధం
- 24 గంటల వ్యవధిలో అన్నాదమ్ముళ్ల మృతి
- లెంకాలపల్లిలో విషాదం



రవీందర్, జలేందర్ (ఫైల్)

నల్లబెల్లి: పసిప్రాయంలో తండ్రిని కోల్పోయారు. ఆ లోటు తెలియకుండా తల్లి వారిని పెంచి పెద్ద చేసింది. బాల్యం నుంచి సోదరులు కలిసి పెరిగారు. ఇప్పుడు 24 గంటల వ్యవధిలోనే ఇద్దరూ మృత్యు ఒడికి చేరుకున్నారు. నీవెంటే నేను అంటూ ఇద్దరూ అనంత లోకాలకు వెళ్లిపోయారు. నల్లబెల్లి మండలం లెంకాలపల్లికి చెందిన రవీందర్ (40), జెలేందర్(37) 24 గంటల వ్యవధిలో మృతి చెందారు. బాల్యంలోనే వీరి తండ్రి వీరయ్య మృతి చెందాడు. కుమారుల్ని తల్లి రాజేశ్వరి కూలీ చేసి పెంచింది. కొంత కాలంగా పెద్ద కుమారుడు రవీందర్ లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. పది రోజులుగా ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. కాగా.. అన్నను చూసి వచ్చేందుకు జెలేందర్ ఈనెల 18న వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు ఆస్పత్రి మెట్లపైనుంచి జారి పడి మృతి చెందాడు. ఈవిషయం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రవీందర్‌కు తెలియకుండా కుటుంబ సభ్యులు జలేందర్ దహన సంస్కారాలు పూర్తి చేశారు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న రవీందర్ సోదరుడి మృతిని తట్టుకోలేకపోయాడు. అది ఆరోగ్య పరిస్థితిపై ప్రభావం చూపడంతో వైద్యులు ఐసీయూకు తరలించి మెరుగైన వైద్యం అందించేందుకు యత్నిస్తుండగా మృతి చెందాడు. అన్నాతమ్ముళ్లు 24 గంటల వ్యవధిలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తమ కుటుంబాలను వదిలి వెళ్లారా అని కుటుంబీకులు గుండెలవిసేలా రోదించారు.

పలువురి పరామర్శ..

జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. రవీందర్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బానోతు సారంగపాణి, నాయకులు ఊడుగుల ప్రవీణ్‌గౌడ్, కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, పాలెపు రాజేశ్వర్‌రావు, మేకల లక్ష్మి, కక్కెర్ల శ్రీనివాస్, గన్నెబోయిన చేరాలు, కొత్తపల్లి అశోక్, కస్తూరి రవి, ఆకుల సాంబరావు ఉన్నారు.

బాలిక కిడ్నాప్ కలకలం

- కిరాణానికి వెళ్లిన బాలిక.. ముఖానికి కర్చీఫ్ పెట్టి కిడ్నాప్
- తప్పించుకుని క్షేమంగా ఇంటికి..
- పీఎస్‌లో తల్లిదండ్రుల ఫిర్యాదు.. కేసు నమోదు
- కిడ్నాప్ కాదంటున్న పోలీసులు



తల్లి కౌసర్‌బేగంతో కుమార్తె బుతుల్

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వే గేట్ ప్రాంతం కాశికుంటలో శుక్రవారం ఉదయం బాలిక కిడ్నాప్ కలకలం రేపింది. పాల ప్యాకెట్ కోసం కిరాణానికి వెళ్లిన 12 ఏళ్ల బాలికను గుర్తు తెలియని వ్యక్తులు అడ్డుకుని మత్తుతో కూడిన కర్చీఫ్ ముఖానికి అడ్డుపెట్టి ఆటోలో కిడ్నాప్ చేశారు. కుమార్తె ఎంతకూ తిరిగి రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. కాశికుంటకు చెందిన ఎండి ఇమ్రాన్, కౌసర్ బేగం దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. ఇమ్రాన్ టింబర్ డిపోలో మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఇమ్రాన్ తల్లి గౌసియా బేగం, అతడి అక్క సాహెదాబేగం వీరు ఇరువురు జక్కలొద్దిలోని సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటైన తాత్కాలిక గుడిసెల్లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం 7.30గంటలకు కౌసర్ బేగం తన కుమార్తె బుతుల్(12)ను పాలప్యాకెట్ తీసుకురమ్మని జన్మభూమి రోడ్డులోని కిరాణం షాపునకు పంపింది. షాపునకు వెళ్తున్న క్రమంలో ముగ్గురు ఆగంతకులు బాలిక ముఖానికి కర్చీఫ్ అడ్డు పెట్టి కిడ్నాప్ చేసి ఆటోలో తీసుకెళ్లారు. కిడ్నాపర్లు ఆటోను వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి మీదుగా వరంగల్ హంటర్ రోడ్డులోని గణపతి కాలేజీ జక్కలొద్ది క్రాస్ రోడ్డు వరకు తీసుకెళ్లారు. అక్కడ కిడ్నాపర్లు టీతాగేందుకు ఆటోను నిలపగా.. మత్తు నుంచి తేరుకున్న బాలిక ఆటో దిగి పరుగు పెట్టింది. అంతలోనే అటుగా వెళ్తున్న గుడిసెవాసులు బాలికను గుర్తు పట్టి ఆటోలో జక్కలొద్ది గుడిసెల్లో నివాసం ఉంటున్న నాన్నమ్మ, మేనత్త సాహెద బేగంకు బాలికను అప్పగించారు. అప్పటికే బాలిక తండ్రి ఇమ్రాన్ డయల్ 100 ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీనిపై తల్లిదండ్రులు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ అప్రమత్తమై కిడ్నాప్ కేసు నమోదు చేసి పోలీసులను అప్రమత్తం చేశాడు. బాలిక మేనత్త సాహెద్ బేగం ఇమ్రాన్‌కు ఫోన్ చేసి చెప్పడంతో ఇమ్రాన్ విషయాన్ని పోలీసులకు తెలిపాడు. కిడ్నాపర్ల కళ్లుగప్పి బాలిక తప్పించుకుని క్షేమంగా ఇంటికి చేరడంతో పోలీసులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పోలీసుల అదుపులో అనుమానితుడు!

బాలిక కిడ్నాప్ ఘటనలో పంజాబ్‌కు చెందిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అతడిని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ఇదే విషయమై ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. బాలికను ఎవరూ కిడ్నాప్ చేయలేదని, ఆకుటుంబానికి సన్నిహితంగా ఉండే ఓవ్యక్తి బంధువుల ఇంటి అడ్రస్ చూపించమని బాలికను ఆటోలో తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇదే విషయం బాలిక స్పష్టంగా చెప్పిందన్నారు. ఇమ్రాన్‌కు సరైన సమాచారం లేక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బ్రేక్ బదులు ఎక్సలేటర్ తొక్కాడు!

- కారు పూజ కోసం వచ్చి బీభత్సం
- ఆరుగురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన కారు ఇదే..

పర్వతగిరి: పర్వతగిరి మండలంలోని ప్రముఖ యాత్రా స్థలం అన్నారం షరీఫ్ దర్గా వద్ద శుక్రవారం కొత్త కారు బీభత్సం సృష్టించింది. ఖమ్మం జిల్లాకు చెందిన రఫీ ఇటీవల కొత్త కారు కొన్నాడు. కారుకు ఫాతెహా (ముస్లిం సంప్రదాయంలో పూజ) చేయించేందుకు షరీఫ్ దర్గాకు వచ్చాడు. దర్గా సమీపంలో కారు నడుపుతుండగా.. భక్తులను తప్పించేందుకు బ్రేక్ వేయబోయి ఎక్స్‌లేటర్ తొక్కాడు. దీంతో కారు మరింత వేగంగా వెళ్లి రోడ్డు పక్కనే ఉన్న బుచ్చన్న, నందిని, చింటు, దస్రు, మాలతిని ఢీకొట్టడంతో వీరికి గాయాలయ్యాయి. అందులో ములుగు జిల్లా గొర్రెపల్లి గ్రామానికి చెందిన నందినికి ముక్కులో నుంచి రక్తస్రావం కావడంతో నందినితో పాటు గాయాలపాలైన నలుగురిని మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎస్సై దేవేందర్, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని కారు యజమాని రఫీని అదుపులోకి తీసుకున్నారు. బ్రీతింగ్ టెస్ట్ చేయగా.. అతడు మద్యం తీసుకోలేదని తేలింది. కాగా.. అతడికి లైసెన్స్ ఉన్నట్లుగా ఎస్సై గుర్తించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. క్షతగాత్రులను వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు పరామర్శించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మాయమాటలు చెప్పి మైనర్‌తో వివాహం

- నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వరంగల్ రూరల్: ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి బలవంతంగా బాలికను పెళ్లి చేసుకుని అత్యాచారానికి పాల్పడిన వరంగల్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధి బాలాజీనగర్‌కు చెందిన శీలపాక బన్నీని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అతడిపై కిడ్నాప్, అత్యాచారం, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఏసీపీ వి.సతీశ్‌కుమార్ ఏనుమాముల సీఐ వి.చేరాలు, ఎస్.ఐ శ్రీకాంత్‌పోగుల తెలిపారు.

ఏసీబీ ట్రాప్

- లంచం తీసుకుంటూ పట్టుబడిన ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు
- వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ సుదర్శన్



ఏసీబీకి చిక్కిన డీఈఈ నవీన్



ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో ఏసీబీ తనిఖీలు



అబీద్‌ఖాన్

ఏటూరునాగారం: ఏటూరు నాగారం ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్‌కు చెందిన ఇద్దరు అధికారులు శుక్రవారం ఏసీబీ వలలో చిక్కారు. 2022 మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సమయంలో గద్దెలు, సాలహారానికి రంగులు(పెయింటింగ్) వేసిన కాంట్రాక్టర్ సంజీవ వద్ద నుంచి లంచం డిమాండ్ చేయడంతో ఆయన ఏసీబీని ఆశ్రయించాడు. ఐటీడీఏ నుంచి నాలుగు నెలల క్రితమే రావాల్సిన నిధులను ఇంజనీరింగ్ శాఖకు అధికారులు అలాట్ చేశారు. అయినా నాలుగు నెలల నుంచి పెయింటర్‌ను అధికారులు కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారు. విసిగిపోయిన కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించాడు. శుక్రవారం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో డీఈఈ నవీన్, ఏఈఈ అబీద్ ఖాన్ పెయింటర్ నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అబీద్ ఖాన్ డ్రాఫ్ట్‌మెన్ అయితే ఏఈఈగా పని చేస్తున్నారు. 15 ఏళ్ల నుంచి ఐటీడీఏలో ఏటూరునాగారం, తాడ్వాయి ప్రాంతాల్లో పని చేస్తున్నారు. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడారం సమ్మక్క సారలమ్మ 2022 జాతరకు గద్దెలు, ఇతర పెయింటింగ్ పనులను ములుగు గ్రామానికి చెందిన పెయింట్ కాంట్రాక్టర్ సంజీవ పనులు చేశాడు. రూ.16.50 లక్షల బిల్లు ఎంబీ రికార్డు చేసి సదరు కాంట్రాక్టర్‌కు డీఈఈ నవీన్, ఏఈఈ అబీద్‌ఖాన్‌లు ఇవ్వాల్సి ఉంది. ఇందుకు రూ. 90 వేలు లంచం ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేశారు. దీంతో సంజీవ ఈనెల 10న ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. మొదటి దఫాగా రూ.50వేలు ఇస్తానని, మిగతావి తర్వాత ఇస్తానని సదరు ఇంజనీరింగ్ అధికారులతో సంజీవ ఒప్పుకున్నాడు. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం ఐటీడీఏ కార్యాలయం వద్ద నవీన్, అబీద్‌ఖాన్ డబ్బులు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రూ. 50వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఏసీబీ డీఎస్పీ, ఏసీబీ సీఐలు శ్యామ్‌సుందర్, రవి, శ్రీనివాస్ ఉన్నారు.

సీసీ పుటేజీల సేకరణ

ఐటీడీఏ కార్యాలయంలోని సీసీ టీవీ పుటేజీలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంజనీరింగ్ అధికారుల కదలికలు, వారిని ఎవరెవరు కలిశారని ఆరా తీస్తున్నారు. గతంలో ఐటీడీఏలో జరిగిన గిరిజన దర్బార్‌లో కూడా తనకు మేడారం బిల్లులు రావాలని సంజీవ వినతి పత్రం అందించారు.

ఏసీబీ వలలో మొదటిసారి!

ఐటీడీఏ ఇంజనీరింగ్‌శాఖ ద్వారా పనులు చేయాలంటే గుండెధైర్యంతోపాటు జేబులో డబ్బులుండాలి. బిల్లులు పొందాలంటే కాళ్లకున్న చెప్పులు అరగక తప్పదు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సమయంలో అనేక బిల్లులను ఆపి కాంట్రాక్టర్లను పీడించి వారి నుంచి లంచాలు పెద్ద మొత్తంలో పొందడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. బిల్లులు సజావుగా రావాలంటే టీఏ, ఏఈఈ, కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి పైవరకు చేతులు తడపక తప్పదని ఏసీబీకి చిక్కిన అధికారులను చూస్తే అర్థం అవుతోంది. ఐటీడీఏ కార్యాలయంలో ఏళ్ల తరబడి ఇక్కడే మకాం వేయడంతో ఏ కాంట్రాక్టర్ ఎలాంటి వారు... ఏ పనులకు ఎంత కమీషన్ పొందవచ్చనేది వారికి వెన్నతో పెట్టిన విద్యగా మారింది. ఐటీడీఏలో ఉన్న అధికారులను బదిలీ చేసి ప్రక్షాళన చేస్తే గిరిజనులకు అందాల్సిన ఫలాలు, పథకాలు అందవని చర్చ జరుగుతోంది. ఇంకా ఇలాంటి అవినీతి తిమింగలాలు చాలానే ఉన్నాయని సోషల్ మీడియాలో అనేక మంది కాంట్రాక్టర్లు, బాధితులు పోస్ట్ చేయడం కొసమెరుపు.